క్లుప్తంగా

సీఎంకు 'చల్లా' వివాహ ఆహ్వాన పత్రిక అందజేత



ఆత్మకూరు : పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తన కూతురు జాహ్నవి వివాహానికి హాజరు కావాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సోమవారం సాయంత్రం సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే ధర్మారెడ్డి కలిసి మాట్లాడారు. జూన్ 3న జరగనున్న వివాహానికి హాజరు కావాల్సిందిగా కోరుతూ పత్రిక అందించారు.

విద్యుత్ వైర్లు తెగిపడి వరి పంట దగ్ధం



పరకాల : విద్యుత్ వైర్లు తెగి పడి మూడెకరాలు వరి పంట దగ్ధమైన ఘటన పట్టణంలోని గుడి మెట్ట శివాలయ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన రైతు కొక్కిరాల వెంకటేశ్వర్‌రావు కోతకు సిద్ధం చేసుకున్న వరి పంట పొలం మీదుగా ఉన్న విద్యుత్ వైర్లు సోమవారం తెగి పడ్డాయి. ఈ మాదంలో వరి పంట పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. పోలీసులు పొలాల వద్దకు ఫైరింజన్ వెళ్లలేని పరిస్థితి ఉండటంతో పచ్చని చెట్ల కొమ్మలతో మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. మిగతా రైతుల పొలాలకు మంటలు వ్యాపించకుండా అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.

మర్రి రవికుమార్‌కు నంది అవార్డు



ఎల్కతుర్తి : మండలంలోని బాహుపేట గ్రామానికి చెందిన సమాజ సేవకుడు మర్రి రవికుమార్‌కు నంది అవార్డు లభించింది. జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈనెల 13న ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ వీఎస్.శ్రీనివాస్‌రాజు, హైదరాబాద్ అసెంబ్లీ సెంట్రల్ జోన్ ఏసీపీ రామదాసు తేజావత్, ప్రముఖ నటి మైథిలి చేతుల మీదుగా రవికుమార్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు రవికుమార్‌ను బాహుపేట సర్పంచ్ దాట్ల రాముడు, ఎంపీటీసీ ఇంద్రసేనారెడ్డి, గ్రామస్తులు అభినందించారు.

బహిరంగ సభకు తరలిన సీపీఐ శ్రేణులు



ఎల్కతుర్తి : 'బీజేపీ హఠావో..దేశ్‌కి బచావో' నినాదంతో హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో తలపెట్టిన బహిరంగ సభకు ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు సోమవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శులు ఉట్కూరి రాములు, ఆదారి శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కర్రె లక్ష్మన్, నిమ్మల మనోహర్, తండ మొండయ్య, గడ్డం రాజనర్సు, కంచర్ల సదానందం, తిరుమల, లలిత, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ర్యాంకర్లకు అభినందనలు

హసన్‌పర్తి: ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ర్యాంకులు సాధించిన హసన్‌పర్తిలోని ప్రభుత్వ జూనియర్ విద్యార్థులను అధ్యాపకులు సోమవారం సన్మానించారు. ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన కళాశాలకు చెందిన కళ్యాణ్‌రామ్, అభిలాష్, సమీర్, అక్షయ్ సౌమ్యను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునీత, కళాశాల అభివృద్ధి కమిటీ బాధ్యుడు చకిలం రాజేశ్వర్ రావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌ను అరెస్ట్ చేయాలి

ఎంజీఎం: గిరిజన సంఘాల నాయకులను కులం పేరుతో దూషించిన ఎంజీఎం సూపరింటెండెంట్‌ను అరెస్ట్ చేయాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ సభ్యుడు జవహర్‌లాల్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వైద్యం వికటించిన మృతుడి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరిన గిరిజన నాయకులను దూషించడం బాధాకరమని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు బానోతు కిషన్, బాలాజీ, సునీల్ నాయక్, ఫణి నాయక్, వెంకట్ నాయక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



శాయంపేట : పోటీలను ప్రారంభిస్తున్న జ్యోతి



ధర్మసాగర్ : పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే



వేలేరు : క్రీడాకారులతో డీసీపీ బారి, తదితరులు

శాయంపేట : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాయ్స్ హైస్కూల్‌లోని క్రీడా మైదానంలో తలపెట్టిన సీఎం కప్–2023 మండల స్థాయి క్రీడాపోటీలను సోమవారం ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను పోత్సహించడానికి ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. 35 ఏళ్ల వరకు వయస్సున్న ప్రతిఒక్కరూ పాల్గొని ప్రతిభ చాటాలని సూచించారు. విద్యార్థులు, యువత ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో క్రీడల్లో సాధన చేయాలని సూచించారు. అనంతరం మండలంలోని నూర్జహాన్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త గుగులోతు కరుణాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతడి భార్యకు రూ.2 లక్షల బీమా చెక్కును కరుణాకర్ భార్యకు జెడ్పీ చైర్‌పర్సన్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాంశెట్టి లత లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, సర్పంచ్ కందగట్ల రవి, ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నందం, సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి పాల్గొన్నారు.

శారీరక, మానసిక వికాసం

ధర్మసాగర్ : క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో తలపెట్టిన సీఎం కప్–2023 మండల స్థాయి క్రీడాపోటీలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం క్రీడాపోటీలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈనెల 17 వరకు మండల, 22 నుంచి 24 వరకు జిల్లా, 28 నుంచి 31 వరకు రాష్ట్ర స్థాయిల్లో క్రీడాపోటీలు జరుగుతాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న క్రమంలో యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మ కవిత, ఎంపీడీఓ గార్లపాటి జవహర్‌రెడ్డి, సర్పంచ్ ఎర్రబెల్లి శరత్, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

వేలేరులో.. మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలోఏర్పాటు చేసిన క్రీడాపోటీలను సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.ఎ.బారి, ఏసీపీ శ్రీనివాస్, ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జెడ్పీటీసీ చాడ సరిత, ఎంపీడీఓ గార్లపాటి జవహర్‌రెడ్డి, సీఐ ఒంటేరు రమేష్, ఎస్సై హరిత, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

● జిల్లా హార్టికల్చర్ అధికారి శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ఆత్మకూరు : ఆయిల్ పామ్ పంట సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని జిల్లా హార్టికల్చర్ అధికారి ఆర్.శ్రీనివాస్‌రావు తెలిపారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామంలోని రైతు వేదికలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు ఒకసారి ఆయిల్ పామ్ మొక్కలు నాటితే 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుందని చెప్పారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఎకరానికి 57 మొక్కలకు 10 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ప్రభుత్వమే డ్రిప్ సదుపాయం కల్పిస్తుందని చెప్పారు. మొదటి మూడేళ్లు అంతర పంటలు సాగు చేసుకుని అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. భవిష్యత్‌లో ఆయిల్ పామ్ పంటకు డిమాండ్ బాగా పెరుగుతుందన్నారు. రైతులు ఆయిల్ పామ్ పంట సాగు చేసి ఆర్థికంగా బలపడాలని సూచించారు. కార్యక్రమంలో డివిజనల్ హార్టికల్చర్ అధికారి మధులత, ఎంపీటీసీ కమలాపురం రమేష్, రాంచరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధిలో 'సర్వోదయ' సేవలు కీలకం



మాట్లాడుతున్న ఎంపీడీఓ పల్లవి

కమలాపూర్ : మహిళలు అభివృద్ధి చెందేలా సర్వోదయ సంస్థ కీలక సేవలు అందిస్తోందని ఎంపీడీఓ జి.పల్లవి తెలిపారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ (ఎస్‌వైఓ) ఆధ్వర్యంలో నాబార్డ్ సహకారంతో మండలంలోని ఉప్పల్ గ్రామంలో మహిళల జీవనోపాధి పెంపుదల, చిన్న తరహా కుటీర పరిశ్రమల ఏర్పాటు కోసం ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో సోమవారం ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలకు అనేక అవకాశాలున్నా సరైన అభివృద్ధి సాధించలేక పోతున్న దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. సర్వోదయ సంస్థ మహిళల సమస్యల పరిష్కారానికే కాకుండా సాధికారత, ఆర్థిక స్వావలంభన కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ గిర్యోజీ నాయక్ మాట్లాడుతూ శిక్షణను మహిళల ఆర్థికాభివృద్ధికి మంచి అవకాశంగా అభివర్ణించారు. 15 రోజుల శిక్షణ బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తుందని తెలిపారు. కుటీర పరిశ్రమల ఏర్పాటు కోసం ఉమ్మడి బాధ్యత సంఘాల ద్వారా రుణం పొందవచ్చని చెప్పారు. సంస్థ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా మహిళల అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో మహిళల ఆధ్వర్యంలో నిర్వహించే వ్యాపార సంస్థలు ఏర్పడతాయని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే మహిళలకు సంస్థ నుంచి రూ.25 వేల వడ్డీ లేని రుణం అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కవిరాజ్, ఇందిర, అక్తర్, టీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

మత్తడి కాల్వ పనులకు సహకరించండి

● మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి



మత్తడిని పరిశీలిస్తున్న కమిషనర్ శేషాంజన్‌స్వామి, వైస్ చైర్మన్ విజయ్‌పాల్‌రెడ్డి

పరకాల : పరకాల మండలంలోని దామెర చెరువు మత్తడి కాల్వ పనులు నిర్వహించడంలో ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి కోరారు. పట్టణంలోని 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారితో కలిసి మత్తడి కాలువను కమిషనర్ శేషాంజన్‌స్వామి సోమవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. వర్షాకాలం నాటికి కాల్వ పనులు పూర్తి కావాలంటే అడ్డుగా ఉన్న ఇండ్ల యాజమానులు సహకరించాలని చెప్పారు. లేనిపక్షంలో వర్షాకాలంలో రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, దళితబంధు పట్టణ కమిటీ కన్వీనర్ సోదా రామకృష్ణ, మున్సిపల్ ఏఈ వంశీకృష్ణ అధికారులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు



వాహనదారుడిని పరీక్షిస్తున్న సీఐ శ్రీనివాస్‌రావు

శాయంపేట : మద్యం సేవించి వాహనాలు నడపొద్దని వాహనదారులకు సీఐ శ్రీనివాస్‌రావు స్పష్టం చేశారు. మండలంలోని మాందారిపేట స్టేజీ వద్ద సోమవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. పలువురు వాహనదారులను బ్రీతింగ్ అనలైజర్‌తో పరీక్షించారు. అనంతరం సీఐ మాట్లాడారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదలు జరిగే అవకాశాలున్నాయని చెప్పారు. అమాయకులు సైతం ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ క్రమంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీరాంరెడ్డి

దామెర : ఆరోగ్యం, ఆర్థిక అవసరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏపీజీవీబీ రీజినల్ అడ్మిన్ ఆఫీసర్ వెంకటాచారి సూచించారు. మండల కేంద్రంలో ఆ బ్యాంకు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించి ఏవైనా సమస్యలు తలెత్తితే నేరుగా బ్యాంకు అధికారులను సంప్రదించాలని కోరారు. సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి మాట్లాడుతూ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ ప్రేమ్‌కుమార్, బ్రాంచ్ మేనేజర్ రాజేష్, బ్యాంకు మిత్ర ఆలేటి రాధిక పాల్గొన్నారు.

డబ్ల్యూసీఎల్ డైరెక్టర్‌గా కమలాపూర్ వాసి



కమలాపూర్ : ప్రభుత్వ రంగ కోల్ ఇండియా అనుబంధ సంస్థ వెస్ట్రన్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ (డబ్ల్యూసీఎల్) డైరెక్టర్ (పర్సనల్)గా హనుమకొండ జిల్లాలోని కమలాపూర్ మండలానికి చెందిన పల్లె బుచ్చిరెడ్డి ఎంపికయ్యారు. ఈనెల 12న జరిగిన పీఈఎస్‌బీ (ఎంపిక బోర్డు) ప్యానెల్ ఎంపిక సమావేశంలో ఎనిమిది మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేయగా బుచ్చిరెడ్డి ఎంపికయ్యారు. బుచ్చిరెడ్డి కొత్తగూడెంలో డిప్లమా పూర్తి చేసి 1989లో నాగపూర్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో మైనింగ్ విభాగంలో బీఈ పూర్తి చేసి అదే ఏడాది వెస్ట్రన్ కోల్ ఫీల్డ్స్‌లో ఉద్యోగం సాధించారు. 1997లో డిప్లమా ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పీజీ చేశారు. 2018లో మహానది కోల్ ఫీల్డ్స్ సంస్థలో హింగులా ఏరియా జనరల్ మేనేజర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అనంతరం జగన్నాథ్ ఏరియా జనరల్ మేనేజర్‌గా నాలుగేళ్లు పని చేసి ప్రస్తుతం మహానది కోల్ ఫీల్డ్స్ వసుంధరా ఏరియా జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. జగన్నాథ్ ఏరియాలోని అనంత ఓసీపీలో అనతికాలంలో బంగారు నాలా మళ్లించి అదనంగా రెండేళ్లు బొగ్గు ఉత్పత్తి చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారు. బుచ్చిరెడ్డి కార్యదక్షతకు గుర్తింపుగా అనేక పురస్కారాలు, అత్యుత్తమ జనరల్ మేనేజర్‌గా అవార్డు అందుకున్నారు.

వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా జీవన్‌కుమార్



పరకాల : స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా జి.జీవన్‌కుమార్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు వరికెల కిషన్‌రావు ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు ఘనంగా సన్మానించి అభినందించారు. సన్మానించిన వారిలో రైతు విమోచన సంఘం అధ్యక్షుడు దగ్గు విజేందర్‌రావు, డీఆర్‌డీయూ అధ్యక్షుడు లంకదాసరి అశోక్, రైతు సంఘం నాయకులు నడిపల్లి సంపత్‌రావు, నడిపల్లి కాంతారావు, ఇటికల నర్సింగరావు తదితరులున్నారు.

రేపు తైబజార్ వేలం

పరకాల : 2023–24 సంవత్సరానికి సంబంధించి పరకాల తైబజార్ లీజ్‌కు ఈనెల 17న (బుధవారం) స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వేలం వేస్తామని మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు రూ.2500లు చెల్లించి దరఖాస్తు ఫారంతోపాటు రూ.2లక్షల డిపాజిట్ డీడీతోపాటు ఎల్‌డీ చెక్కులు, రూ.3 లక్షల విలువైన ధృవీకరణ పత్రం ఈనెల 16న సాయంత్రం 5గంటల లోపు కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వేలం దక్కించుకున్న వ్యక్తులు మూడ్రోజుల్లోగా పాట మొత్తంలో 30 శాతం చెల్లించి సొంత ఖర్చులతో మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. మిగితా మొత్తానికి బ్యాంక్ గ్యారంటీతోపాటు ప్రభుత్వ ఉద్యోగి గ్యారంటీ ఇవ్వాలని పేర్కొన్నారు.

'ఆ విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలి'

హన్మకొండ అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల పేరుతో భారీ యాడ్స్, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్న అవినాష్ విద్యాసంస్థలను మూసివేసి, యాజమాన్యంపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏబీఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడారు. అవినాష్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంలా చూస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి ఆ సంస్థ గుర్తింపు రద్దు చేసి మూసివేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, నాయకులు అజయ్‌గౌడ్, భరత్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే ఉత్తమ విద్య

● ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

ధర్మసాగర్ : ప్రభుత్వ కళాశాలల్లోనే ఉత్తమ విద్యాబోధన అందుతుందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. అత్యున్నత విద్యార్హతలు కలిగిన అధ్యాపకులు ప్రభుత్వ కళాశాలల్లోనే ఉన్నారని చెప్పారు. ఎంతో మంది మేథావులు ప్రభుత్వ కళాశాలల్లో లెక్చరర్లుగా, ప్రొఫెసర్లుగా పని చేస్తూ విద్యార్థులను సమాజం గర్వించే స్థాయిలో ఎదిగేలా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. దేశ, రాష్ట్ర స్థాయిల్లో అత్యున్నత పదవుల్లో, ఉద్యోగాల్లో ఉన్న వారిలో అత్యధికులు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకున్న వారేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ఎనలేని చొరవ తీసుకుంటోందని చెప్పారు. విద్యార్థులు ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. భారత రక్షణ రంగ సహాయ విభాగమైన ఎన్‌సీసీ ఉన్న ఏకైక కళాశాలగా స్థానిక ప్రభుత్వ కళాశాల మండలంలో విద్యార్థులకు అందుబాటులో ఉందన్నారు. కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కళాశాలలో మౌలిక సౌకర్యాల కల్పనకు తాను రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ అస్నాల శ్రీనివాస్ మాట్లాడారు. ధర్మసాగర్, వేలేరు మండలాల పౌర సమాజం, ఉపాధ్యాయులు అవకాశం ఉన్న విద్యార్థులందరికీ కళాశాలలో చేర్చేలా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో డీసీపీ ఎం.ఎ.బారీ, ఎంపీపీ నిమ్మ కవిత, సర్పంచ్ ఎర్రబెల్లి శరత్, ఎంపీడీఓ గార్లపాటి జవహర్‌రెడ్డి, అధ్యాపకులు కనకయ్య, జ్యోతి, బాబురావు, రాములు, గోపాలకృష్ణ, ప్రభాకర్, గణేష్, మంజుల పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

● పీహెచ్‌సీలో జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి తనిఖీ



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గండ్ర జ్యోతి

శాయంపేట : ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి వైద్యులకు, సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ)ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఉన్న రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును తెలుసుకున్నారు. అనంతరం ఉద్యోగుల అటెండెన్స్, మందుల స్టాక్ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్యుల, సిబ్బంది హాజరు తీరుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ సాయికృష్ణ, సిబ్బందితో మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో వడదెబ్బపై అవగాహన కల్పించాలని చెప్పారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మండలంలోని మైలారం, నేరేడుపల్లి, తహరాపూర్, పెద్దకోడెపాక, పత్తిపాక, ప్రగతి సింగారం గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి ప్రారంభించి మాట్లాడారు. దళారీ వ్యవస్థను రూపుమాపడం, రైతులకు సరైన ధర కల్పించడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాంశెట్టి లత లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, సర్పంచ్ కందగట్ల రవి, ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి నందం, సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో వృషభ సంక్రమణ పూజలు



రుద్రహోమం జరిపిస్తున్న అర్చకులు

ఐనవోలు : సూర్యుడు వృషభరాశిలోకి ప్రవేశించిన సందర్భంగా మండల కేంద్రంలోని ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో అర్చకులు వృషభ సంక్రమణ ప్రత్యేక పూజలు సోమవారం నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామి వారి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం వృషభ సంక్రమణ పూజతోపాటు రుద్రాభిషేకం, రుద్రహోమం చేశారు. గొల్ల కేతమ్మ, బలజ మేడలమ్మ సమేత శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం శైవాగమోక్తంగా జరిపించారు. ఒగ్గు పూజారులు గర్భాలయం ఎదుట మహా మండపంలో నజరు పట్నం వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వృషభ సంక్రమణ పూజల వివరాలను ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) అద్దంకి నాగేశ్వర్‌రావు మీడియాకు వెల్లడించారు. కార్యక్రమంలో ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్ శర్మ, వేద పారాయణదారు గట్టు పురుషోత్తమ శర్మ, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.